క్లుప్తంగా

పారిశుద్ధ్య నిర్వహణలో సమస్యలుంటే చెప్పండి



పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమకు చెప్పాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మొగల్రాజపురం, జమ్మి చెట్టు సెంటర్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్, నిర్మల కాన్వెంట్ రోడ్, ఆటోనగర్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ.. నిత్యం ఇళ్ల వద్ద వ్యర్థాలు సేకరణ చేస్తున్నారా, వ్యర్థాలను ఇళ్ల వద్దనే విభజిస్తున్నారా, వారికి తడి చెత్త, పొడి చెత్త, హానికారక వ్యర్థాలను వేరుచేసి ఇమ్మని అవగాహన కల్పిస్తున్నారా అని ఆరా తీశారు. ప్రజలు వీధిలో పడేస్తున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారా, ప్రతి రోజు సైడ్ కాల్వలను, రహదారులను, శుభ్రపరుస్తున్నారా వంటి అంశాలను అడిగారు. తాము వ్యర్థాలు తొలగిస్తున్నప్పటికీ అందుకు తగిన విధంగా వాహనాలు అందుబాటులో లేవని కార్మికులు కమిషనర్‌కు చెప్పటంతో వ్యర్థాలు రవాణా వాహనాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులు, ప్రజా ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మాన్సూన్ రెస్పాన్స్ టీమ్ అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు వర్షపు నీటి నిల్వలను రోడ్లపై నుంచి తొలగించాలని ఆదేశించారు.

చెస్‌లో మరింతగా రాణించాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చెస్‌లో మరింతగా రాణించి విజయవాడ కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలపాలని శ్రీగౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు పేర్కొన్నారు. శ్రీగౌతమ్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి వి.హేమంత్‌కుమార్ చెస్‌లో బ్లిడ్జ్ 1634 రేటింగ్ సాధించాడు. ఇటీవల నగరంలోని పీబీ సిద్ధార్థ కాలేజీలో ఎస్ఆర్ఆర్ ఇంటర్నేషనల్ ఓపెన్, బ్లిడ్జ్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నీ జరిగింది. ఈ టోర్నీలో హేమంత్‌కుమార్ 1634 రేటింగ్‌ను సాధించడంతో మంగళవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హేమంత్‌కుమార్‌ను స్కూల్ ప్రిన్సిపల్ సూర్యారావు, చెస్ కోచ్ అవ్వారు రామకృష్ణ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని టోర్నీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

యువతి అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టైలరు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి నగదు, బంగారం తీసుకుని బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన కందుల దాసుబాబు కుటుంబం జేపీ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటోంది. దాసుబాబు ఓ ప్రైవేటు బ్యాంక్‌లో రికవరీ ఏజెంట్‌గా పని చేస్తుంటారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె కందుల రాణి సంయుక్త(25) గత కొంత కాలంగా రవితేజ అనే వ్యక్తితో ఎక్కువగా ఫోన్ మాట్లాడుతూ ఉంది. గత నెల 30వ తేదీ సాయంత్రం టైలర్ వద్దకు వెళ్లివస్తానని చెప్పి ఇంట్లో బంగారపు వస్తువులు, ఆరు లక్షల నగదు, బంగారపు చైన్, మరి కొన్ని బంగారపు వస్తువులు తీసుకుని బయటకు వెళ్లింది. రాత్రి అయినా సంయుక్త తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు స్నేహితులు, బంధువుల ఇంట విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ ట్రెండ్‌సెట్ మెడోస్‌లో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ట్రెండ్‌సెట్ మెడోస్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. గాయత్రి వీణానాథం, మౌనిక బృందం కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తి కీర్తనలకు అనుగుణంగా చేసిన కోలాటం, నృత్యాలు చూపరులను ఆనంద పరవశులను చేశాయి. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన గాయత్రి తదితరులకు రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారావు, యర్రంశెట్టి మురళీ, ఉపాధ్యక్షులు కోలా దుర్గాప్రసాద్, బుజ్జి, రామాయణపు రామమూర్తి చేతులమీదుగా జ్ఞాపికలను ప్రదానం చేశారు.



ఫ్రైజర్‌పేటలో నివాళులర్పిస్తున్న నేతలు



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న షేక్ ఆసిఫ్ తదితరులు



మేయర్ కార్యాలయం వద్ద అన్నదానం చేస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

సంక్షేమ సామ్రాట్ మహానేత వైఎస్

- వాడవాడలా మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు
- పేదలకు అన్నదానం, పండ్లు, చీరలు పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో అద్భుతమైన సంక్షేమ పథకాలను అమలు చేసి సంక్షేమ సామ్రాట్‌గా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. పేదలకు అన్నదానం, పండ్లు, మహిళలకు చీరలు, విద్యార్థులకు బ్యాగ్‌లు తదితర సేవ కార్యక్రమాల్లో నేతలు పాల్గొన్నారు. 52వ డివిజన్ బ్రాహ్మణ వీధిలోని రావి చెట్టు సెంటర్ వద్ద పార్టీ డివిజన్ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెలంపల్లి పాల్గొని నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. బ్రాహ్మణవీధిలోని మరుపిళ్ల చిట్టిగారి ఇంటి వద్ద స్థానిక పార్టీ నేత పోతిన రాము ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు మరుపిళ్ల నాగస్వజన, కర్నాటి రాంబాబు, బంకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక 51వ డివిజన్ శ్రీనివాస మహల్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద స్థానిక డివిజన్ ఇన్‌చార్జి తుపాకుల గురుమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పేదలకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక 54వ డివిజన్, పంజా సెంటర్ వద్ద స్థానిక నేతలు పైడాడ శ్రీనివాసరావు, రుద్రపాటి తేజ్ కుమార్‌ల ఆధ్వర్యంలో పేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి పంపిణీ చేశారు. 53వ డివిజన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి శ్రీహరి తన కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ అన్నారు. ఆసిఫ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వైఎస్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసిఫ్ పలువురు నేతలతో కలిసి వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తిని అందిపుచ్చుకొని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అపూర్వమైన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు రఫీ, కలిమీ, మహేష్, కల్యాణ్, లక్ష్మణ్, జాన్సన్, బూలా, వంశీ, రఫీ, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, గోదావరి గంగ తదితరులు

చెరగని చిరునవ్వుకు చిరునామా..

భవానీపురం(విజయవాడపశ్చిమ): చెరగని చిరునవ్వుకు చిరునామా అయిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిత్య స్మరణీయుడని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో అన్నం వడ్డించారు. జోగి రమేష్ మాట్లాడుతూ శత్రువును సైతం క్షమించే గుణం, కపటం లేని దార్శనికత, మోసం లేని రాజకీయం వెరసి డాక్టర్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. జలయజ్ఞంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే కాకుండా పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలను అమలు చేశారని కొనియాడారు. గొల్లపూడి గ్రామ నాయకులు పాల్గొన్నారు.



గొల్లపూడి అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న జోగి రమేష్

పేదల గుండెచప్పుడు వైఎస్సార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నింపి పేద ప్రజల గుండెచప్పుడు అయిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని పేదలు నిత్యం స్మరించుకుంటూనే ఉన్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 47వ డివిజన్ పరిధిలోని సర్దార్ మరుపిళ్ల చిట్టి పార్క్ వద్ద స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ–బాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని వైఎస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కొనకళ్ల విద్యాధరరావు, గోదావరి బాబు, కూరాకుల నాగ, దిద్దుకూరి శివ, రెడపంగు క్రాంతి, నన్నం దుర్గ తదితరులు పాల్గొన్నారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని చెరువు సెంటర్‌లో డివిజన్ ఇన్‌చార్జ్ పెద్ది సాయిబాబు ఆధ్వర్యంలో వెలంపల్లి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బొండా నిరీష్, వల్లం రవి, అంకాని నాగరాజు, కెనడి, కరీం తదితరులు పాల్గొన్నారు. విద్యాధరపురం కబేళా సెంటర్‌లో 45వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ సరగడ శంకరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెలంపల్లి పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

భవానీపురం వ్యాప్తంగా..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం వ్యాప్తంగా మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మహానేత ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. వైఎస్సార్ మరణించి ఏళ్లు గడిచినా పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారం చేశారన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చంద్రబాబు హయంలో పేదలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. వైఎస్సార్ పాలన సువర్ణ యుగంలా సాగిందన్నారు. 40వ డివిజన్ పరిధిలోని భవానీపురం బ్యాంక్ సెంటర్ నందు కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి వెలంపల్లి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. 41వ డివిజన్ మసీదు వీధిలో డివిజన్ కార్పొరేటర్ మోహమ్మద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు..42వ డివిజన్ పరిధిలోని శివాలయం సెంటర్‌లో కార్పొరేటర్ చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. మహానేత కాంస్య విగ్రహానికి వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి నివాళులర్పించారు. అనంతరం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఊర్మిళానగర్ 43వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. వీఎంసీ కల్యాణ మండపంలో రోడ్డులో బెవర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం అంటే మహానేత వైఎస్సార్ గుర్తుకొస్తారు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపించిన గొప్ప నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ కొనియాడారు. దివంగత వైఎస్సార్ 16వ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు కంట్రోల్ రూం వద్ద వైఎస్సార్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి జోగి రమేష్, మాజీ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, పూనూరు గౌతంరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి షేక్ ఆసిఫ్, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన వెంకట మహేష్, పార్టీ నాయకులు పాల్గొని మహానేత విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన మహానేత వర్ధంతి, సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, 108 వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన తర్వాత ఆ విధంగా పరిపాలన చేసిన నాయకుడు వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అందించిన ఘనత వైఎస్సార్ కుటుంబానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు పేరు చెబితే ఏ ఒక్క పథకం గుర్తు రాదని, ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారన్న ఒక్క విషయమే గుర్తుకు వస్తుందన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా పేదల కష్టాలు తెలుసుకొని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం గత 14 నెలలుగా దుర్మార్గపు పాలన సాగిస్తోందన్నారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ.. దివంగత వైఎస్సార్ పాలన ఈ రాష్ట్రానికే ఒక రోల్ మోడల్ అన్నారు.

చిట్టినగర్ పరిధిలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 46వ డివిజన్ మేయర్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌కు పార్టీ నేతలు ఘన నివాళులర్పించారు. తొలుత కేటీ రోడ్డులోని మేయర్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు రాయన నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి మాజీ మంత్రి వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, డివిజన్ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్, షేక్ ఆదిల్, ట్రాక్టర్ రాము, శ్యామ్, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు. చిట్టినగర్ జంక్షన్‌లో గౌతమ్ స్కూల్ వద్ద 48వ డివిజన్ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు(జగ్గు), అయితా కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెలంపల్లి పేదలకు, మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు కోళ్ల రజనీ, చిచ్చా, దాసిన ఏసు, మజ్జి శ్రీనివాసరావు,గురువులు, యంగల ఉమా, పిళ్లా నాగమణి, బాయన అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు అనిర్వచనీయం

విజయవాడలీగల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, అపర భగీరథుడు వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన సేవలు అనిర్వచనీయమని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా కొనియాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఏపీ ఆర్టీఐ కమిషనర్ అంబటి సుబ్బారావు, బీబీఏ జాయింట్ సెక్రటరీ జి.వరాహ లక్ష్మి, న్యాయవాదులు గౌతమిరెడ్డి, గురునాథం, మతిన్, బూసి సతీష్, పిల్లా రవి పాల్గొని నివాళులర్పించారు.



విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

మరువలేని మహానేత రాజశేఖరరెడ్డి..

వించిపేట(విజయవాడపశ్చిమ): మరువలేని మహానేత వైఎస్సార్ అని వెలంపల్లి అన్నారు. వైఎస్సార్ సీపీ 49వ డివిజన్ అధ్యక్షుడు గౌడుపేరు సుదీర్ ఆధ్వర్యంలో వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, నాయకులు చేపూరి శ్రీను, రెడ్డిబోయిన మోజేష్, బేవర బాలు, మార్కు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



44వ డివిజన్‌లో చీరలు పంపిణీ చేస్తున్న వెలంపల్లి, సాయిబాబు



బీబీఏ హాల్‌లో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



శివాలయం సెంటర్‌లో నివాళి



బ్యాంక్ సెంటర్‌లో అన్నదానం చేస్తున్న నాయకులు

ఆద్యంతప్రభువుగా బాలగణపతి దర్శనం



ఆద్యంతప్రభువుగా బాలగణపతి



వేలంలో లడ్డూ దక్కించుకున్న రాజేష్

రూ.3.11 లక్షలకు లడ్డూ పాడుకున్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతి ఆద్యంతప్రభువుగా(వినాయకుడు అంజనేయుడు) మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ బాలగణపతి ఆలయంలో జరుగుతున్న వినాయకచవితి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించారు. శాస్త్రోక్తంగా సహస్ర మోదక పూజను, సహస్ర నామార్చనను నిర్వహించారు. శ్రీబాలగణపతి మహిళా మండలి ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. శ్రీబాలగణపతి మహిళా మండలి ప్రముఖులు ఆతుకూరి శ్రీదేవి, మామిడి శివపార్వతిదేవి, మండేపూడి లలితా, చెర్విరాల విజయ తదితరులు పాల్గొన్నారు. నవ రాత్రోత్సవాల సందర్భంగా కమిటీ వారు నిర్వహించిన లడ్డూను వేలంలో దేవి పవిత్ర డైమండ్స్ అధినేత కొల్లిపర రాజేష్ దక్కించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావు, కోశాధికారి మండేపూడి వేణుగోపాలరావు తదితరులు పర్యవేక్షించారు.



అన్నప్రసాద వితరణ చేస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): గత కొన్ని సంవత్సరాలుగా శ్రీవరసిద్ధి వినాయక మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు 34వ డివిజన్ గణేష్ భక్త బృందం నిర్వాహకులు ఎండీ విజయలక్ష్మి తెలిపారు. కేదారేశ్వరపేట, మసీదు సెంటర్ వద్ద గణేష్ భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం 2 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణపురం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ముందుగా గణేషునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఎండీ సుభానీ ఫ్రెండ్స్ సర్కిల్, గణేష్ భక్త బృందం, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని హెచ్‌ఐజీలు, హెచ్ ఆర్‌టీతో పాటు రిలయన్స్ స్మార్ట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

గుర్తింపు కార్డు ఉంటేనే వీధి వ్యాపారానికి అనుమతి

పటమట(విజయవాడతూర్పు): వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డు ఉంటేనే వీధుల్లో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఉంటుందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. వీధివిక్రయదారుల చట్టం 2014 ప్రకారం విజయవాడ నగరంలో వివిధ రకాల వీధి వ్యాపారాలు చేస్తున్న వీధి వ్యాపారస్తులందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్లను తీసుకోవాలన్నారు. నగరంలో మెప్మా రిసోర్స్ పర్సన్లు, వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శుల ద్వారా సర్వేలో పాల్గొన్న ప్రతి వీధివిక్రయదారులు గుర్తింపు కార్డు వెండింగ్ సర్టిఫికెట్ పొందుటకు రూ.200 చెల్లించాలని చెప్పారు. ఈ రుసుము కమిషనర్ వీఎంసీ టౌన్ వెండింగ్ కమిటీ పేరుతో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ ఖాతా నెంబర్. 01010100025000, ఐఎఫ్ఎస్సీ కోడ్ ఐఓబీఏ 0000101కు చెల్లించాలన్నారు. చెల్లింపు రసీదు/చలానా/ కౌంటర్ ఫైల్‌లను, యూపీఐ ద్వారా పేమెంట్ చేయువారు ఫోన్ స్క్రీన్ షాట్ ప్రింట్ కాపీలను వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉన్న యూసీడీ విభాగంలో అందజేయాలని సూచించారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడికి న్యాయస్థానం ఏడు నెలల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధించింది. వివరాల ప్రకారం సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిర్యాది తన కుటుంబంతో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ నివశిస్తున్నాడు. కాగా గతేడాది మే 20న రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన చేతిలో రాయి చూపించి చంపుతానని బెదిరించి తన జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పోయినట్లు సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. నాటి ఏఎస్ఐ ఐ.పరమేశ్వరరావు దర్యాప్తు చేసి, గతేడాది మే 22న నిందితుడు చుట్టుగుంటకు చెందిన ఉప్పు దుర్గారావును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం చార్జ్‌షీట్ ఫైల్ చేయగా, విచారణ అనంతరం దుర్గారావుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి గండికోట దేవిక నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.గంగాధర్, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ఎస్ఆర్ పేట ఇన్‌స్పెక్టర్ ఆలీ, సీఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో ఐదుగురి సాక్షులను విచారించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
9010210386
Office mail : sakshiads@gmail.com